క్లుప్తంగా

రఘునాథపాలెంలో ఓపెన్ స్కూల్ సెంటర్

రఘునాథపాలెం: వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఆపై ఇంటర్ పూర్తిచేసే అవకాశం లభిస్తోంది. ఈమేరకు రఘునాథపాలెం మండల అభ్యర్థుల కోసం స్థానిక ఉన్నత పాఠశాలలో ఈసారి కొత్తగా ఓపెన్ స్కూల్ కేంద్రాన్ని మంజూరు చేసినట్లు ఎంఈఓ బి.రాములు తెలిపారు. 14ఏళ్లు నిండిన వారు పదో తరగతిలో చేరేందుకు స్కూల్ హెచ్ఎం(కోఆర్డినేటర్) ఎం.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శివకుమార్‌ను సంప్రదించాలని సూచించారు.

నాణ్యతలో రాజీ పడొద్దు..

రఘునాథపాలెం: వర్షపు నీరు నిల్వ లేకుండా ముందస్తు ప్రణాళికలతో నాణ్యతలో రాజీ లేకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని జింకలతండా రోడ్డులోని గిడ్డంగుల సంస్థ ఆవరణలో జరుగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం గోడౌన్‌లో సన్న బియ్యం నిల్వలు, భద్రతపై ఆరా తీసి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఆయన వెంట సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, గిడ్డంగుల సిబ్బంది ఉన్నారు.

రాధాకృష్ణ వర్ధంతి

ఖమ్మంరూరల్: మండలంలోని కాచిరాజుగూడెంలో న్యూడెమోక్రసీ నాయకుడు రాధాకృష్ణ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయనకు నివాళులర్పించిన న్యూడెమోక్రసీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఆవునూరి మధు ఆయన సేవలను కొనియాడి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఉద్యమకారులను అణచివేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి పి.రాజేంద్రప్రసాద్, నాయకులు కోల లక్ష్మీనారాయణ, నర్సయ్య, బజ్జూరి వెంకట్రామిరెడ్డి, రాధక్క, ఐ.వెంకన్న, శీలం సుదర్శన్, తోట చిన్న అప్పారావు పాల్గొన్నారు.

బ్యాగులు, నోట్ బుక్స్ పంపిణీ



బ్యాగులు, నోట్‌బుక్స్‌తో విద్యార్థులు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన కమతం అరుణ్‌కుమార్(రాము) లండన్‌లో ఉంటున్న తన స్నేహితుడు డాక్టర్ నీలేష్‌కుమార్ సహకారంతో గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు, పెన్నులు, కాంపాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం రవికుమార్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు రాము పాఠశాలలో స్మార్ట్ టీవీ, ప్రొజెక్టర్, ల్యాప్‌టాప్, నెట్ సదుపాయంతో పాటు సీసీకెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేందర్, కమతం రాము, కమతం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయంగా మోదీ పాలన

ఖమ్మం మామిళ్లగూడెం: పేదరిక నిర్మూలనే ధ్యేయంగా ప్రధాని మోదీ పాలన సాగుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు అన్నారు. బుధవారం ఖమ్మం అర్బన్ 4వ, 5వ డివిజన్లలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా పేద ప్రజల అభ్యున్నతి మోదీ ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. అనంతరం శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో మొక్కలు నాటారు. ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, నున్నా రవికుమార్, మందడపు సుబ్బారావు, దొడ్డ అరుణ, సరస్వతి, కుమిలి శ్రీనివాసరావు, అల్లిక వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సరిత

ఖమ్మంరూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున ఏఈఓలు రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు చేయాలని ఏడీఏ సరిత అన్నారు. మండలంలోని పొన్నేకల్ రైతువేదికలో బుధవారం ఏఈఓలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రైతులకు వర్తించే పథకాలు, సబ్సిడీలు, ఎరువుల వాడకం, పామాయిల్ సాగు విధానం, అందులో వేసే అంతర పంటల వల్ల కలిగే లాభాలపై వివరించాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ ఉమానగేష్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

‘దోస్త్’ జోష్..



ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్‌లో ప్రవేశాలు..

నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్ మీడియం కలిపి 12 కోర్సులు ఉండగా.. మొత్తంగా 1,560 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందే అవకాశం ఉంది. అయితే అత్యధికంగా బీకామ్ (కంప్యూటర్ అప్లికేషన్‌)కు 360 సీట్లు ఉండగా.. ఇప్పటికే 184 మంది సెల్ఫ్ రిపోర్ట్ చేశారు. ఆ తర్వాత బీఎస్సీ (ఫిజికల్ సైన్స్/ఎకనామిక్స్)కు 240సీట్లకు గాను 104 మంది, బీఏ ఇంగ్లిష్ మీడియంలో 240 సీట్లకు గాను 118 మంది సెల్ఫ్ రిపోర్ట్ చేశారు. మిగితా సబ్జెక్టులకు సైతం త్వరలో సెల్ఫ్ రిపోర్ట్ చేయనున్నారు.

జోరుగా డిగ్రీలో ప్రవేశాలు

- రెండో దశకు మంచి స్పందన
- కొనసాగుతున్న మూడో దశ
- 28న సీట్ల అలాట్‌మెంట్.. 30న భర్తీ

ఖమ్మంసహకారనగర్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ప్రవేశాలు వేగం పుంజుకుంటున్నాయి. ప్రస్తుతం మూడో దశ ప్రవేశాలు జరుగుతుండగా.. విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. నగరంలో రెండు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉండగా.. అందులో అతి పెద్దదైన ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ప్రతి సంవత్సరం ప్రవేశాలలో ముందంజలోనే ఉంటున్నాయి. జిల్లా కేంద్రమైన ఖమ్మంలో ఉండడంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులు విద్యను బోధిస్తుండగా.. ప్రతి ఏడాది ప్రవేశాల సంఖ్య జోరందుకుంటూనే ఉన్నాయి.

కొనసాగుతున్న మూడో దశ..

ఈ ఏడాది 2025–26 విద్యా సంవత్సరంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) రెండో విడతల్లో ప్రవేశ ప్రక్రియ కొనసాగగా.. రెండింటిలోనూ అత్యధికంగా విద్యార్థులు ఆప్షన్లు ఎంచుకున్నారు. అనేకమంది విద్యార్థులు ఇప్పటికే సెల్ఫ్ రిపోర్టింగ్ చేయగా.. మిగితా విద్యార్థులు త్వరితగతిన చేసే అవకాశం ఉంది. మూడో విడత ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.

28న సీట్ల అలాట్‌మెంట్..

మూడవ విడత దోస్త్ కౌన్సెలింగ్ జరుగుతుండగా... ఈ నెల 28వ తేదీన సీట్ల అలాట్‌మెంట్ జరగనుంది. 30న విద్యార్థులు సెల్ఫ్ రిపోర్ట్ చేయనున్నారు. దీని ఆధారంగా కళాశాలల్లో ప్రవేశాల సంఖ్య తేలనుంది.

ప్రవేశాల పెంపునకు కృషి..



కళాశాలలో ప్రవేశాలు పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే తమ కళాశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, సౌకర్యాలపై అవగాహన కల్పించాం. దోస్త్ 1వ, 2వ ఫేజ్‌ల్లో సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఆధార్ లింకైన ఫోన్ నంబర్‌కు కళాశాల కన్ఫర్మేషన్ ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీని కళాశాల కార్యాలయంలో అందించి ఇంటర్ ఒరిజనల్ టీసీ అందించి సీటు కన్ఫర్మ్ చేసుకోవాలి. మూడవ ఫేజ్ 28న సీట్లు అలాట్‌మెంట్ కాగా.. ఈ నెల 30 వరకు సర్టిఫికెట్లు పరిశీలించి ఫైనల్ సీట్లు కన్ఫర్మ్ చేయనున్నాం.

– మహ్మద్ జకీరుల్లా,
ప్రిన్సిపాల్, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

మహిళా డిగ్రీ కళాశాలలో..

మహిళా డిగ్రీ కళాశాలలో మొత్తం 540 సీట్లకు గాను ఇప్పటి వరకు 107మంది ప్రవేశాలు పొందారు. ఇందులో ఎంపీసీలో 120 సీట్లకు గాను 30 మంది, బీజెడ్‌సీలో 120కి 31 మంది, బీఏలో 180కి 16మంది, బీకాంలో 120కి 30మంది మొత్తంగా 107 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ఇదిలా ఉండగా ప్రతీ ఏడాది చివరి ఫేజ్‌లో అడ్మిషన్ల సంఖ్య పెరుగుతున్నట్లు కళాశాల బాధ్యులు చెబుతున్నారు.

అడ్మిషన్లు లేకుంటే సర్దుబాటు తప్పదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ చలపతిరావు

నేలకొండపల్లి: బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలని, లేకుండా సర్దుబాటు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని ఎంఈఓ బి.చలపతిరావు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బడిబాటలో విద్యార్థుల సంఖ్య నమోదు లేని పాఠశాలలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందించే ఉచిత పుస్తకాలు, ఏకరూప వస్త్రాలు, నాణ్యమైన భోజనం తదితర వాటి గురించి వివరించి తల్లిదండ్రులను ఒప్పించి చేర్పించాలని, చేరిన విద్యార్థులు రెగ్యులర్‌గా వస్తున్నారా లేదా అని నిత్యం ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ లు ప్రసాద్, కె.వెంకటేశ్వర్లు, హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం ఐక్య పోరాటం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

రఘునాథపాలెం: భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని ప్రగతిశీల భవన నిర్మాణ, ఇతర నిర్మాణ కార్మిక సంఘ జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న పేర్కొన్నారు. మండలంలోని కోయచలక గ్రామంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1న ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే జిల్లాస్థాయి మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సభకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. సంఘ మండల అధ్యక్షుడు పసుపులేటి నరసింహారావు సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో శ్రీను, వెంకట్, నరసయ్య, నరసింహారావు, రాములు, వెంకన్న, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వర్షం .. హర్షం



తిరుమలాయపాలెం: ఎదుళ్లచెరువులో తడిసిన పత్తి చేను



వర్షంలో తడుస్తూ వెళ్తున్న వాహనదారులు

ఇన్నాళ్లూ ఎదురు చూసిన రైతన్నలను వరుణుడు కరుణించాడు. బుధవారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో.. గత 15 రోజుల నుంచి ఎండిపోతున్న పత్తి విత్తనాలకు జీవం పోసినట్లయింది. మరోపక్క వాహనదారులు వర్షంలో తడుస్తూ అవస్థలు పడ్డారు. రోజంతా చల్లటి వాతావరణంతో పాటు వర్షం కురవడంతో ప్రజలు సేదదీరారు.

– సాక్షినెట్‌వర్క్

‘మతం పేరుతో ఉన్మాదం సృష్టిస్తున్న కేంద్రం’



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కూసుమంచి: మతం పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉన్మాదం సృష్టిస్తుందని, ఇది కూడాఉగ్రవాదంతో సమానమేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం కూసుమంచిలో నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. సీపీఐతో పాటు ఇతర కమ్యూనిస్టు పార్టీలు కీలక పోరాటాలతోనే జమిందారు, జాగీర్దారు, పటేల్, పట్వారీ వ్యవస్థలు రద్దయి భూమిలేని ఎందరికో భూమి దక్కిందని, కార్మికులకు హక్కులు లభించాయన్నారు. ప్రజల ఆస్తులు పరిరక్షించడంలో సీపీఐ పోరాటం ఎనలేనిదని అన్నారు. పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా మాట్లాడుతూ.. రానున్న సంస్థాగత ఎన్నికల్లో పార్టీ సత్తాను చూపాలన్నారు. పార్టీ నాయకులు సంగబత్తుల ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మహాసభలో సీనియర్ నాయకులు భూక్యా మంగ్యా పతాకాన్ని ఎగురవేశారు. అంతకుముందు మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామ్మూర్తినాయక్, మండల కార్యదర్శి భూక్యా నర్సింహా, జిల్లా సమితి సభ్యులు తోట రామాంజనేయులు, గుండెపొంగు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం/ఖమ్మంఅర్బన్/ఖమ్మంరూరల్: దేశవ్యాప్తంగా జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వై.విక్రమ్, ఖమ్మంఅర్బన్ మండలం ఖానాపురం హవేలీ పరిధిలోని షాపింగ్‌మాల్స్‌లో యాజమాన్యాలకు సమ్మె నోటీసు అందించి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండారు యాకయ్య, గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పిన్నింటి రమ్య, జిల్లా కమిటీ సభ్యుడు దొంగల తిరుపతిరావు మాట్లాడగా, ఖమ్మంరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపరింటెండెంట్ శ్రీలతకు వినతిపత్రం అందించి మాట్లాడారు. లేబర్ కోడ్ లను రద్దు చేయాలని , రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఉపేందర్, రాందాస్, సతీష్, ఎస్కే కాసిం, నరసయ్య, ఎస్.నవీన్ రెడ్డి, మురహరి , రామయ్య, నాగరాజు, వెంకన్న, రాములు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవన్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అందుకు సైనికుల్లా అహర్నిశలు పనిచేయాలని, ముమ్ముందు పనికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు కనకబండి సీతారాములు, మండల సహాయ కార్యదర్శులు మారిశెట్టి వెంకటేశ్వరరావు, పాల్తీయ శ్రీనివాసరావు, నాయకులు మల్లేబోయిన ఉపేందర్, కర్నాటి నళినిరాణి, రాయల మాధవరావు, మాళోత్ అయోధ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్ అంధకారం

మాదకద్రవ్యాల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా బుధవారం పలు విద్యాలయాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేసి సర్టిఫికెట్లతో పాటు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. డ్రగ్స్‌తో భవిష్యత్ అంధకారం అవుతుందని, దీని నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా కృషి చేసి మంచి సమాజ నిర్మాణానికి పాటుపడాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంఅర్బన్: ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో బహుమతులు అందిస్తున్న టౌన్ ఏసీపీ రమణమూర్తి



కామేపల్లి: హైస్కూల్ విద్యార్థులకు పోస్టర్ల ద్వారా అవగాహన కల్పిస్తున్న సీఐ తిరుపతిరెడ్డి



ఖమ్మం సహకారనగర్: శాంతినగర్ కళాశాలలో బహుమతులు అందిస్తున్న సీఐ కరుణాకర్



ఖమ్మంరూరల్: జలగంనగర్ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఐ హరికృష్ణ

సంక్షిప్తంగా..

మెరుగైన వైద్య సేవలకు కృషి

నేలకొండపల్లి: జిల్లాలోని సీహెచ్‌సీలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, పేషెంట్లతో అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఈమేరకు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మంగళ, సిబ్బంది పాల్గొన్నారు.

గోశాలలకు రూ. 50 వేల దాణా వితరణ



వితరణ చేస్తున్న సేవా సమితి ప్రతినిధులు, సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: బహుళ అమావాస్య సందర్భంగా బుధవారం శ్రీ స్తంభాద్రి సేవా సమితి ఆధ్వర్యాన నగరంలోని పలు గోశాలలకు దాణా వితరణ అందజేశారు. స్థానిక వ్యాపారులు, దాల్‌మిల్ యజమానులు, ఎగుమతి వ్యాపారులు, స్తంభాద్రి సేవా సమితి సభ్యుల దాతృత్వంతో రూ. 50 వేల విలువైన దాణాను టేకులపల్లిలోని శ్రీవేంకటేశ్వర మందిరం గోశాలకు, గొల్లగూడెంలోని ఓం శ్రీ కృష్ణ గోశాల, త్రీటౌన్‌లోని కరిగిరి శ్రీ లక్ష్మీరంగనాథ స్వామి గోశాలకు వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ తూములూరి లక్ష్మీనరసింహారావు, పల్లా లింగయ్య, దేవరశెట్టి రామారావు, జంగిలి రమణ, సుంకర యల్లారావు, పులిపాటి సంపత్‌కుమార్, కందిబండ రమేష్, దేవిశెట్టి బాబు, పెనుగొండ సాయికుమార్, నవీన్, భాస్కర్, శ్రీనివాసరావు, రమేష్, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక

ఖమ్మం వ్యవసాయం: నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలోని పంపింగ్ వెల్‌రోడ్‌లో గల శ్రీపెద్దమ్మతల్లి దేవాలయ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. దేవాలయ శాశ్వత సభ్యుడు బొల్లం సోమయ్య సమక్షంలో ఎన్నుకోగా అధ్యక్షుడిగా కోయిల వీరభద్రం, ప్రధాన కార్యదర్శిగా సారికపాపారావు, కోశాధికారిగా బండి నవీన్, ఉపాధ్యక్షులుగా అంకతి పాపారావు, జంగం రాము, సహాయ కార్యదర్శిగా కందుకూరి సురేష్, ప్రచార కార్యదర్శులుగా గుడిసె రాంబాబు, ముదిగొండ సైదులు, వెంకటరమణ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సారిక రాము, గౌరవ అధ్యక్షులుగా మల్లెల అప్పారావు, దేవరగట్లవిష్ణు, బొల్లం యాకయ్య, గౌరవ సలహాదారులుగా రుద్రగాని ఉపేందర్, ముక్కాలరాజేష్, పొన్నెబోయిన సాయి నియమితులయ్యారు. వీరికి కమిటీ సభ్యులు తమ అభినందనలు తెలిపారు.

కేఎంసీ కమిషనర్‌కు అభినందనలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తయిన సందర్భంగా అభిషేక్ అగస్త్యకు కేఎంసీ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు. కమిషనర్ చేత కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కేఎంసీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పౌర సేవలు అందించేందుకు విశేషంగా కృషి చేశారని కొనియాడారు.

అసిస్టెంట్ కమిషనర్‌కు సత్కారం



షఫీఉల్లాను సత్కరిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తూ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న అహ్మద్ షఫీ ఉల్లాను కేఎంసీ ఉద్యోగులు బుధవారం శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎంసీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఆయన కేఎంసీకి అందించిన సేవలను కొనియాడారు. కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆయనకు అభినందనలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

తిరుమలాయపాలెం: సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో తిరుమలాయపాలెం పీహెచ్‌సీ ఆధ్వర్యన బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మహీధర్‌రెడ్డి, సూరజ్‌కిరణ్, హెచ్ఈఓ దూప్‌సింగ్, ఎంఎల్‌హెచ్‌పీ నాగవేణి, ఏఎన్ఎంలు సీత, అనిత, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శివాయిగూడెంలో రక్తదానం..

రఘునాథపాలెం: మండలంలోని శివాయిగూడెంలో గ్రామ మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్ జన్మదినం సందర్భంగా శ్రీరామ్ యూత్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 25 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చింతగుర్తి మాజీ సర్పంచ్ మెంటం రామారావు, నంద, తేజావత్ లాలు, లాల్‌సింగ్, సైదా, తావు, నాయకులు బానోత్ రాజు, వీరన్న, రాజు, రామకృష్ణ, అశోక్, హరి, వెంకటేష్, గార్లపాటి శ్రీను, నాగులు తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ సలాం

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్ పరిధిలో దీర్ఘకాలికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. బుధవారం గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన గురుప్రసాద్ భవన్‌లో నిర్వహించిన టూటౌన్ ఏరియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డ్రెయినేజీ వ్యవస్థను బాగు చేసి రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని, తాగునీటిని రోజూ అందించాలన్నారు. వచ్చేనెల ఒకటిన నిర్వహించే టూటౌన్ ఏరియా సీపీఐ మహాసభను జయప్రదం చేయాలని కోరారు. టూటౌన్ ఏరియా కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు, నాయకులు బోడ వీరన్న, ఎస్‌కె.సైదా, జ్వాలా నరసింహారావు, ఎస్‌కె.చానా, సతీష్‌రెడ్డి, భద్రం తదితరులు పాల్గొన్నారు.

వినతుల పర్వం..

ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌కు..

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెంలోని సుబ్లేడు ఎస్టీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీఎస్పీ పాలేరు నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షులు ఎన్నబోయిన రమేష్, కొమ్ము పూలేలు బుధవారం ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. హాస్టల్‌ను పరిశీలించిన వారు మాట్లాడుతూ.. హాస్టల్ భవనం శిథిలావస్థలకు చేరిందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌కు

ఖమ్మం మామిళ్లగూడెం: మొక్కజొన్న సాగు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యాన బుధవారం హైదరాబాద్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రంగారావు, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పగడవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలను సాగుచేయించిన ఆర్గనైజర్ల నుంచి డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాజిరెడ్డి, మందనపు రామారావు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు..



వెంకటయ్యకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు

కామేపల్లి: మండలంలోని పింజరమడుగులో ఇటీవల దళితులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను దళిత బాధితులు చిప్పలపల్లి ఆనందరావు ఆయన కుటుంబీకులు బుధవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, బాధిత దళితులకు న్యాయం జరిగేలా చూడాలని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డిని ఆయన ఆదేశించారు.

సమాచారం..

నేడు మంత్రి తుమ్మల పర్యటన

రఘునాథపాలెం: రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం మండలంలో పర్యటించనున్నారని బుధవారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదలైంది. గురువారం ఉదయం 11.30 గంటలకు మండలంలోని పుటానితండాలో, మధ్యాహ్నం 12 గంటలకు సూర్యతండా గ్రామంలో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ

ఖమ్మంమయూరిసెంటర్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 7 గంటలకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ర్యాలీ వెంకటరమణ టాటా మోటార్స్, రత్నదీప్ ఎదురుగా గల ఖాళీ స్థలం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు కొనసాగుతుందన్నారు.

రేపు హైదరాబాద్‌లో మహాధర్నా..

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 27న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన మహాధర్నా నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్, రిపిట్ ఆఫ్ పత్రిక సంపాదకుడు పి.నాగిరెడ్డిలు తెలిపారు. బుధవారం సంఘం కార్యాలయంలో మహాధర్నా పోస్టర్లు ఆవిష్కరించారు. టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళరావు, ఖమ్మం జిల్లా విద్యా పరిరక్షణ కమిటీ బాధ్యులు బాబురావు, విద్యార్థి సంఘ నాయకులు మస్తాన్, వెంకటేష్, నరేందర్ పాల్గొన్నారు.